## క్లుప్తంగా

### నేడు శని త్రయోదశి



గర్భగుడిలో కొలువైన స్వామివారు

**మోమిన్‌పేట:** శని త్రయోదశి సందర్భంగా ఏన్కతల శనైశ్చర స్వామి ఆలయం ముస్తాబయింది. శని త్రయోదశి, శని అమావాస్య రోజున స్వామి వారికి అత్యంత ప్రీతి పాత్రమైన నల్లని దుస్తులు, నువ్వుల నూనెతో అభిషేకం చేస్తే కోరిన కోర్కెలు తీరుస్తాడని భక్తుల విశ్వాసం. శనివారం త్రయోదశి సందర్భంగా భక్తజనం స్వామి వారిని దర్శించుకొని, అభిషేకం చేసేందుకు ఉదయం నుంచే దేవాలయానికి బారులు తీరుతారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

### పోలింగ్ కేంద్రాల తనిఖీ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఐ

**పెద్దేముల్:** పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో గోపాల్‌పూర్, నాగులపల్లిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శుక్రవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ)రాజీరెడ్డి తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులను పరిశీలించారు. బాత్‌రూమ్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. గోపాల్‌పూర్ గ్రామంలో తగిన వసతులతో పాటు పాఠశాలకు ప్రహరీ ఉందని జీపీ కార్యదర్శి రాథోడ్ సంగీత ఆర్‌ఐకి తెలిపారు.

### కాంగ్రెస్‌కు యువతే వెన్నెముక



నూతన కమిటీకి నియామక పత్రం అందజేస్తున్న నాగప్ప

**తాండూరు రూరల్:** కాంగ్రెస్‌కు యువతే వెన్నెముక అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప అన్నారు. శుక్రవారం తాండూరు మండలం యూత్ కాంగ్రెస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జగదీష్, ఉపాధ్యక్షులుగా ఇంద్ర, రత్, షోర్, హరికృష్ణ, సాయిలు, గోవర్ధన్ గౌడ్‌లను నియమించారు. అనంతరం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగప్ప మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో యువతకు ప్రాధాన్యత కల్పిస్తామని పేర్కొన్నారు. ఇందులో మండల ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి,నాయకులు రాజశేఖర్‌లు ఉన్నారు.

### అగ్ని ప్రమాదాలపై అవగాహన



ప్రమాదాల గురించి వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**కొడంగల్:** అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక కేంద్రం అధికారి ప్రభాకర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు. గ్యాస్ సిలిండర్ వాడే విధానాన్ని సూచించారు. లీకేజి అయితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. ప్రిన్సిపాల్ రాజారాం, అగ్నిమాపక సిబ్బంది, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

### రైల్వే వంతెన పనులు ఆపండి..

**తాండూరు:** పాత తాండూరులో నిరిస్తున్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వలన నాలుగు వార్డు ప్రజలకు అన్యాయం జరుగుతోందని, వెంటనే ఆ వంతెన నిర్మాణ పనులు ఆపేలా చూడాలని మాజీ ఎంపీ, బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని స్థానికులు కోరారు. గురువారం రాత్రి పాత తాండూరు రైల్వేగేట్‌ను కొండా సందర్శించారు. ఈ సందర్భంగా 15వ వార్డు కౌన్సిలర్ బొబ్బిలి శోభారాణి, స్థానిక ప్రజలు ఆయనను కలిశారు. బ్రిడ్జి నిర్మిస్తే 13,14,15,16 వార్డులతో పాటు 31వ వార్డు ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. రైల్వేగేట్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపడతామని చెప్పి, బ్రిడ్జిని నిర్మిస్తున్నారని కొండాకు వివరించారు. వెంటనే వంతెన నిర్మాణ పనులు ఆపించి, తమకు న్యాయం చేయాలని కోరారు. దీనికి స్పందించిన కొండా మాట్లాడుతూ.. రైల్వే శాఖ అధికారులతో మాట్లాడి, పనులు ఆపేలా చూస్తానని హామీనిచ్చారు.

# సమస్య ఎక్కడున్నా.. సబ్ స్టేషన్ బంద్

- కానరాని ఏబీ స్విచ్‌లు
- ఉన్నా పనిచేయని వైనం
- సమస్య ఎక్కడ వచ్చినా.. ఫీడర్ పరిధి వినియోగదారులకు చీకట్లే
- పట్టించుకోని విద్యుత్ అధికారులు



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పనిచేయని ఏబీ స్విచ్

**దౌల్తాబాద్:** సాంకేతిక కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో, విద్యుత్‌తో పనిచేసే పనిముట్లు, యంత్రాలు విస్తృతంగా వినియోగంలోకి వచ్చాయి. చిన్నచిన్న దుకాణాలతో పాటు, భారీ కర్మాగారాలు, ప్రతి ఇంట్లోనూ వీటి అవసరాలు అనేకం. టీవీలు చూడటం తప్పనిసరి. ఫ్యాన్లు, మిక్సీలు, గ్రైండర్లు, కుక్కర్లు పనిచేయాలంటే తప్పనిసరిగా కరెంట్ అవసరమే. రాత్రి సమయంలో వీధి దీపాలు వెలగాలన్నా కరెంట్ ఉంటేనే వెలుగు. ఒక్క మాటలో చెప్పాలంటే.. విద్యుత్ లేనిదే ఏ పని జరగదు అనేది అందరికీ తెలిసిందే. ఇంతటి ప్రాధాన్యత కలిగిన విద్యుత్ సరఫరాకు ఏ మాత్రం అంతరాయం కలిగినా అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. ముఖ్యంగా పట్టణాల్లో, అత్యవసర సమయాల్లో..

**పనిచేయని ఏబీ స్విచ్‌లు**

మండల పరిధి 33 గ్రామ పంచాయతీల్లో సుమారు 300 వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. కానీ.. వాటికి ఏర్పాటు చేసిన ఏబీ స్విచ్‌లు చాలా చోట్లా పనిచేయడం లేదు. కొన్ని నియంత్రికల వద్ద పనిచేస్తున్నా, ఉపయోగించడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఏబీ స్విచ్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలను తొలగించి, నేరుగా ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా అయ్యేలా సంబంధిత సిబ్బంది ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సరఫరాను నిలిపివేయాలంటే, లైన్‌మెన్‌లు సబ్‌స్టేషన్ సిబ్బందికి ఫోన్‌చేసి, ఎల్‌సీ తీసుకోవాల్సి ఉంటుంది. సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ఆ ఫీడర్ మొత్తం సరఫరా నిలిచిపోతుంది.

**అంతటా అదే సమస్య**

ఒక ఇంట్లో విద్యుత్ మరమ్మతులు చేపట్టాలన్నా, లేదా కొత్తగా కనెక్షన్ ఇవ్వాలన్నా, ఏ చిన్న ఫీజ్ తీగ పోయినా ఆ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి సరఫరా నిలిపివేయాలి. అలా చేయాలంటే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏబీ స్విచ్ అమర్చి ఉండాలి. కానీ.. లేని చోట లేనేలేవు. ఉన్న చోట అవి పనిచేయడం లేదు. పోల్ నుంచి సరఫరాను నేరుగా ట్రాన్స్‌ఫార్మర్‌కు మళ్లించడంతో.. సరఫరాను నిలిపివేయాలంటే సబ్‌స్టేషన్ నుంచి బంద్ చేయాలి. అలా చేస్తే ఫీడర్ మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. దీని ఫలితంగా అనేక మంది ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు గుర్తించి, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏబీ స్విచ్‌లు అమర్చేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

> **నివేదించాం..**
>
> మండల పరిధి అనేక ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేశాం. కొన్ని చోట్ల పనిచేయడంలేదు. వాటికి మరమ్మతులు చేపడతాం. ఇప్పటి వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఏబీ స్విచ్‌లు లేని ప్రాంతాల్లో అమర్చడానికి ఉన్నతాధికారులకు నివేదించాం.
>
> – మహిపాల్, ఏఈ, దౌల్తాబాద్

# దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యం

**బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి**



సమావేశంలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**తాండూరు టౌన్:** దేశాభివృద్ధి కేవలం ప్రధాని మోదీతోనే సాధ్యమని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం రాత్రి తాండూరు పట్టణంలో మార్వాడీ సమాజ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతి రహిత పాలన అందిస్తున్న మోదీ సారథ్యంలో తిరిగి మూడోసారి పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీజేపీ పాలనకు ముందు కాంగ్రెస్ అవినీతి కంపులో దేశం కూరుకుపోయిందని చెప్పారు. అనేక స్కాంలతో.. అవినీతిమయం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా బీజేపీని ఆదరించి, దేశాభివృద్ధికి దోహదపడాలని కోరారు. సమావేశంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు రమేష్ కుమార్, బాలేశ్వర్ గుప్తా, భద్రేశ్వర్, శ్రీలత, మార్వాడీ సమాజ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికతో లక్ష్యం సులభం

- కూలీల శాతం పెంచి, ఉపాధి పనుల్లో వేగం పెంచాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి



**అనంతగిరి:** 'ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనుల్లో కూలీల సంఖ్యను పెంచి, పనులను వేగవంతం చేయాలి. పక్కా ప్రణాళికతో కార్యాచరణ చేపడితే.. లక్ష్యం సులభతరం అవుతుంది' అని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సంబంధిత అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సీసీరోడ్లకు సంబంధించి, లేబర్ మొబిలైజేషన్ తక్కువ ఉన్న గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పనులు మానిటరింగ్ చేసే వ్యక్తిని ఏర్పాటు చేసి, పనులు చేయించాలని సూచించారు. కూలీలు తక్కువ ఉన్న ఊర్లపై దృష్టి సారించి, అంచనా ప్రకారం లేబర్ల సంఖ్యను పెంచి, 100 శాతం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల చివరి వరకు పూర్తయిన పనులకు ఎఫ్‌టీఓ జనరేట్ చేయాలని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్డీఏ శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఏపీఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నిర్మాణాలకు అనుమతి తప్పనిసరి

- లేదంటే కూల్చేస్తాం
- డీఎల్‌పీఓ శంకర్‌నాయక్



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

**పెద్దేముల్:** గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా గ్రామాల్లో నిర్మాణ పనులు చేపడితే చర్యలు తీసుకోవడంతో పాటు, కూల్చి వేస్తామని డీఎల్‌పీఓ శంకర్ నాయక్ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధి ఖానాపూర్ గ్రామంలో గ్రామ కంఠం స్థలంలో అనుమతి లేకుండా నిర్మాణం చేపడుతున్నట్లు సమాచారం వచ్చిందని తెలిపారు. ఈ మేరకు పర్యవేక్షించామని వెల్లడించారు. సొంత స్థలం ఉంటే.. సంబంధిత పత్రాలు చూపించాలని, లేదంటే కూల్చి వేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పత్రాలు చూపించని ఎడలా.. నిర్మాణ పనులను నిలిపివేయాలని కార్యదర్శికి సూచించారు. వారితో పంచాయతీ కార్యదర్శి యశ్వంత్ ఉన్నారు.

# ఘనంగా రేణుకాచార్యుల జయంతి



కుల్కచర్ల: జగద్గురు చిత్రపటానికి పూజలు చేస్తున్న భక్తులు

**కుల్కచర్ల:** ఆది జగద్గురువులు శ్రీశ్రీశ్రీ రేణుకాచార్యుల జయంతిని ఓంకారేశ్వర స్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామంలో వీరశైవ మత స్థాపకులు రేణుకాచార్యుల చిత్రపటానికి పూజలు చేశారు. లింగం నుంచి ఉద్భవించిన రేణుకాచార్యులు.. వీరశైవుల ద్వారా ధర్మస్థాపనకు కృషి చేశారని ఆలయ అర్చకులు మఠం రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వీరశైవులు పాల్గొన్నారు.

**కొడంగల్‌లో..**

**కొడంగల్ రూరల్:** ఆదిజగద్గురు రేణుకాచార్య జయంతిని పట్టణంలోని శ్రీ జగద్గురు నిరంజన మఠంలో ఘనంగా నిర్వహించారు. వీరశైవ లింగాయత్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జగద్గురు ప్రవచనాలను గుర్తు చేసుకున్నారు. వారు చూపిన మార్గంలో వీరశైవ లింగాయత్‌లు నడుచుకోవాలని సూచించారు. ఇందులో గడ్డం శేఖర్, సర్వేష్, రాకేశ్, బాల ప్రకాశ్, నాగరాజు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల ఒడిలో బడి

**అసంపూర్తిగా మరుగుదొడ్లు**

- పాఠశాల ఆవరణలో బండరాళ్లు
- ఆటలకు దూరమైన విద్యార్థులు



పాఠశాల ఆవరణలో బండరాళ్లు



వినియోగంలోకి రాని మరుగుదొడ్డి

**తాండూరు రూరల్:** సరస్వతి నిలయంలో సమస్యలు తాండవిస్తున్నాయి. అసౌకర్యాల నడుమ విద్యార్థులు కాలం నెట్టుకొస్తున్నారు. చదువుపై ఉన్న మమకారమే.. చింతన ఉన్నా.. వారిని చిరునవ్వుతో బడికి వచ్చేలా చేస్తోంది. తాండూరు మండలం చెంగోల్ గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు తరగతులు కొనసాగుతున్నాయి. ఇందులో 320 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. చెంగోల్, చింతమణిపట్నం, పర్వాతాపూర్, గౌతపూర్ గ్రామాల నుంచి పిల్లలు ఈ పాఠశాలకు వస్తుంటారు.

**అత్యవసరాలు ఆరుబయటే..**

సౌకర్యాల లేమితో పాఠశాల కొట్టుమిట్టాడుతోంది. మరమ్మతుకు నోచుకోని ప్రహరి, అసంపూర్తి నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్డి, పాఠశాల ఆవరణలో అపరిశుభ్రత వాతావరణం వెరసి.. విద్యార్థులు అసౌకర్యానికి లోనవుతున్నారు. బడి ప్రాంగణంలో పెద్దపెద్ద బండరాళ్లు ఉండటంతో విద్యార్థులు ఆటలకు దూరం అయ్యారు. పాఠశాల ప్రహరి కూలిపోగా.. అది మరమ్మతుకు నోచుకోవడం లేదు వినియోగంలో ఉన్న ఒకే ఒక్క మరుగుదొడ్డిని విద్యార్థినులు ఉపయోగిస్తున్నారు. బాలురు అత్యవసరాలకు ఆరుబయటకు పరుగెత్తుతున్నారు. ఇక ఉపాధ్యాయ బృందం పరిస్థితి సరేసరి. గతంలో గ్రామానికి చెందిన కొందరు.. బండ రాళ్లను తొలగించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించారు. అయినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా.. విద్యార్థుల సౌకర్యార్థం బండలను తొలగించేందుకు, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాటుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

# ధ్యానంతో ఆరోగ్యం పదిలం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అంజనేయరెడ్డి

**దోమ:** ఆరోగ్యం పదిలంగా ఉండాలంటే.. ధ్యానం అలవర్చుకోవాలని పిరమిడ్ స్పిరుచువల్ సంస్థ ప్రచార కార్యదర్శి అంజనేయరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి దాదాపూర్ పాఠశాలలో ధ్యానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ధ్యానం ఆరోగ్యానికి మేలు చేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిత్యం ధ్యానంను అలవాటు చేసుకుంటే గుండె జబ్బు, బీపీ, షుగర్, కిడ్నీ సంబంధిత వ్యాధులు దరిచేరవని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు కరుణశ్రీ, కవిత, చంద్రమౌళి, సంస్థ సభ్యులు ప్రకాశ్‌రెడ్డి, చెన్నయ్య, నవీన్, బాబు, వేణు తదితరులు పాల్గొన్నారు.

### కేంద్రాల్లో మౌలిక వసతులు

**బషీరాబాద్:** పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మండలంలోని 47 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ వెంకటేశం తెలిపారు. శుక్రవారం మండల పరిధి నీళ్లపల్లి, జలాల్‌పూర్, పర్వత్‌పల్లి, మాసన్‌పల్లి, కొర్విచెడ్‌గని, బషీరాబాద్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ప్రతి బూత్‌లో విద్యుత్, ఫర్నిచర్, ర్యాంపు, మరుగుదొడ్లు, వెంటిలేషన్ ఉండేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. వృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

### ఓబీసీ మోర్చా సమ్మేళనం నేడు

**యాలాల:** బీజేపీ ఓబీసీ మోర్చా సామాజిక సమ్మేళన కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలో సాయంత్రం 5 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి మోర్చా జిల్లా అధ్యక్షుడు బొప్పి శ్రీహరి, పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, మండల అధ్యక్షుడు జంగం యాదగిరి, ప్రధాన కార్యదర్శి శంకర్‌రెడ్డి తదితరులు హాజరవనున్నట్లు ఆయన తెలిపారు. కావున పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

### యువకుల రక్తదానం

**ధారూరు:** ధారూరు మండల యూత్ కాంగ్రెస్ యువకులు శుక్రవారం రక్తదానం చేశారు. వికారాబాద్ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు లింగనపల్లి అశోక్, ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో 50 యువకులు రక్తదానం చేశారు. వీరికి ఎస్‌ఐ వేణుగోపాల్‌రెడ్డి సారథ్యం వహించారు.

### 'లక్ష్యసాధనకు కృషి'

**కొత్తూరు:** విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి నిరంతరం కృషి చేయాలని సిద్దాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు పలువురు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు.. ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లో సాంకేతికత చాలా వరకు విస్తరించినట్లు వివరించారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి.

# మోదీ హ్యాట్రిక్ విజయం ఖాయం

**తాండూరు:** కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, ప్రధానిగా మోదీ కావడం ఖాయమని ఆ పార్టీ నాయకుడు, మాజీ మంత్రి చందుమహరాజ్ తనయుడు నరేష్ మహరాజ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం.. పార్టీ పట్టణ నూతన కార్యవర్గాన్ని నియమించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో చెవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ ఉపాధ్యక్షులుగా దోమ కృష్ణ, మంతటి రాజు, కోట్ల నరేందర్‌రెడ్డి, సంగమేశ్వర్, చిదిచి ప్రకాష్, శృతి, ప్రధాన కార్యదర్శులుగా అంతారం కిరణ్ ముదిరాజ్, మిట్టి శ్రీనివాస్, కెళిగెరి ప్రవీణ్, కార్యదర్శులుగా రాంచందర్, శివాజీ ఠాకూర్, పోల శ్రీనివాస్, బిచ్చప్ప, కావలి కృష్ణ, కోశాధికారిగా ప్రహ్లాద్‌రావు జాదవ్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడిగా నరేష్, మహిళా అధ్యక్షురాలిగా అర్చన, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా శివకుమార్, దళిత మోర్చా అధ్యక్షుడిగా అల్లు ప్రసాద్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా నరేష్‌కుమార్, గిరిజన మోర్చా అధ్యక్షుడిగా ఎస్.శ్యామ్ సుందర్‌నాయక్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా ఎస్.కే.షాబుద్దీన్‌లను నియమించారు.

### గ్రామానికి బస్సు నడపాలి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**పూడూరు:** కంకల్ గ్రామానికి బస్సు నడపాలని గ్రామ యువజన నాయకుడు రవీందర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం పరిగి డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. పరిగి, షాద్‌నగర్, వయా కంకల్ మీదుగా గతంలో బస్సు తిరిగేదని, ప్రస్తుతం నిలిపివేశారని పేర్కొన్నారు. అదే సర్వీసును పునరుద్ధరించాలని కోరారు. బస్సు సౌకర్యం లేక ప్రాంత ప్రజలు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గ్రామ ప్రజల సౌకర్యార్థం బస్సును నడపాలని విన్నవించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు మల్లేశ్, శ్రీకాంత్, గొల్ల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# పూడూరులో పోలీసుల కవాతు

**పూడూరు:** పార్లమెంటు ఎన్నికల సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా పరిగి సీఐ శ్రీనివాస్ మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా.. సమస్యాత్మక ప్రాంతాలైన పూడూరు, మన్నేగుడ, చన్గోముల్, కంకల్, మంచన్‌పల్లి గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించినట్లు తెలిపారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చన్గోముల్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పూడూరు చౌరస్తాలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు.

# వేదిక నిర్మించారు.. వాడుక మరిచారు



- ఆరు నెలలైనా ప్రారంభానికి నోచుకోని రైతు వేదిక

**తాండూరు రూరల్:** అన్నదాతలకు శాస్త్రీయ, సాంకేతిక సలహాలు అందిస్తూ.. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్న కృతనిశ్చయంతో ప్రభుత్వం రూ.22 లక్షలు వెచ్చించి రైతు వేదికను నిర్మించింది. కానీ వాడుక మరిచింది. నిర్మాణం పూర్తయి ఆరు నెలలు గడిచినా.. ప్రారంభానికి నోచుకోవడం లేదు. తాండూరు మండలం చెంగోల్ గ్రామంలో గత అసెంబ్లీ ఎన్నికల ముందు వేదిక నిర్మాణం పూర్తయింది. కేవలం విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. కారణం ఏదైనప్పటికీ.. వేదిక వినియోగంలోకి రాలేదు. వేదికను త్వరగా ప్రారంభిస్తే.. తమకు ఉపయోగ పడుతుందని రైతులు కోరుతున్నారు. ఈ వేదిక క్లస్టర్ కింద చెంగోల్, చింతమణిపట్నం, పర్వాత ఎన్ఆర్ గ్రామాలు ఉన్నాయి. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత, సంబంధిత అధికారులు త్వరగా స్పందించి వేదికను వాడుకలోకి తీసుకురావాలని రైతులు వేడుకుంటున్నారు.